క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి పూజలు



పొదలకూరు: మండలంలోని ఆర్‌వైపాళెంలో గురువారం అయ్యప్పస్వామి అంబళ్లపూజ వైభవంగా జరిగింది. భక్తులు పూల అలంకరణతో 18 మెట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

విశేషాలంకారంలో సాయినాథుడు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులు భజనలు చేశారు.
• **మనుబోలు:** మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. మనుబోలులో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

దివ్యాంగులకు అండగా ఉందాం



ఉపకరణాల అందజేత

ముత్తుకూరు: దివ్యాంగులను తక్కువగా చూడకూడదని, వారికి అండగా ఉండాలని ఎంఈఓ హేమసుందర్ అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలోని భవిత సెంటర్‌లో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓతోపాటు హెచ్‌ఎం షఫీ మాట్లాడారు. దివ్యాంగులకు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, హేమంత్‌కుమార్‌లు మాట్లాడారు. అనంతరం వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, వాకర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుచ్చిలో విద్యుత్ అదాలత్



బుచ్చిరెడ్డిపాళెం: విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని స్థానిక అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పొలాల్లోని స్తంభాలకు తీగలు అల్లుకోవడంతో తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని, దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు ఎగిరిపోతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. సంగం, దగదర్తి, బుచ్చిరెడ్డిపాళేనికి సంబంధించి 30 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

లోతుగా విచారణ

నెల్లూరు(క్రైమ్): నకిలీ వే బిల్లులు, నకిలీ జీఎస్టీ నంబర్లతో ప్రభుత్వానికి పన్నులు ఎగవేస్తున్న వ్యాపారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. గుట్కా మాఫియాపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో ఎన్టీఆర్‌నగర్‌లో మహేంద్రకు చెందిన గోదాముపై దాడులు చేసి గుట్కా, పాన్ మసాలాలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వీటికి జీఎస్టీని చెల్లించకపోవడంతో విచారణను గురువారం చేపట్టారు. సదరు వ్యాపారి గుట్కాలను ఎక్కడ.. ఎంత మొత్తంలో కొనుగోలు చేశారు.. ఎవరెవరికి విక్రయించారు.. దీని తాలూకు జీఎస్టీ, వే బిల్లులు తదితరాలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆరాతీస్తున్నారు.

షేర్లు, వ్యాపారాల్లో భాగస్వామ్యం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ప్రముఖ కంపెనీల్లో షేర్లు.. వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానంటూ పలువుర్ని మోసగించిన వ్యక్తిపై బాలాజీనగర్ పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రామ్‌జీనగర్‌కు చెందిన ప్రసాద్ వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. ప్రముఖ కంపెనీలో షేర్లు.. వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానని చిల్డ్రన్స్‌పార్క్ ప్రాంతానికి చెందిన శ్రావణ్‌కుమార్ వద్ద రూ.1.6 కోట్లను తీసుకొని మోసగించారు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. కాగా ప్రసాద్ ఇదే తరహాలో మరో పది మందిని మోసగించారని సమాచారం.

ఆక్వాకు రక్షణగా..

- మత్స్య ఉత్పత్తులకు బయో సెక్యూరిటీ
- రొయ్యల గుంతల చుట్టూ వలలు
- మండలంలో రెండు వేల ఎకరాలకు పైగా సాగు



పీవీ కండ్రిగలో రొయ్యల గుంత చుట్టూ ఏర్పాటు చేసిన వల

ముత్తుకూరు: రొయ్యలు, చేపల పెంపకానికి ఆక్వా రైతులు రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో వైరస్‌లే కాకుండా వ్యాధి కారక జీవులను సరఫరా చేసే వాటి విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనినే జీవ సంరక్షణ లేక బయో సెక్యూరిటీ అంటారు. రొయ్యల చెరువు నేలను ఎండబెట్టి బ్లీచింగ్ వాడటం ద్వారా రోగ కారక క్రిములను నాశనం చేస్తారు. కానీ కొన్ని జీవులు చెరువుల్లోకి చొరబడి రొయ్యలను వ్యాధులకు గురి చేసే పరిస్థితిని నియంత్రించేందుకు కూడా జాగ్రత్తలు పాటించాలి.

51 శాతం

మనిషికి అవసరమైన మత్స్య ఉత్పత్తులు 51 శాతం ఆక్వా కల్చర్ ద్వారా లభిస్తున్నాయి. సముద్ర తీర ప్రాంతమైన ముత్తుకూరు మండలంలోనే సుమారు 2,000 ఎకరాలకుపైగా వెనామీ రొయ్యల పెంపకం జరుగుతోంది. వైరస్‌లు, బాక్టీరియాలు, పరాన్న జీవుల ద్వారా హేచరీలు, రొయ్యల చెరువులకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఇందులో వైట్‌స్పాట్ వైరస్ ప్రధానమైంది. ఆక్వా కల్చర్‌నే అతలాకుతలం చేసింది. ఇక హేచరీల్లోని సీడ్ ద్వారా కూడా రోగాలు చెరువుల్లోకి ప్రవేశించి రొయ్యల పెంపకాన్ని దెబ్బతీస్తాయి. మోటార్ల ద్వారా నీటిని సంగ్రహించే సమయంలో డెలివరీ పైపు చివర జల్లెడ వంటి మెష్‌ను బిగిస్తే చెరువులోకి రోగ కారక క్రిములు, గుడ్లు ప్రవేశించవు.

అడ్డుకట్ట ఇలా..

ప్రమాదకర వైరస్‌ను, వ్యాధి కారక జీవులను మోసుకొచ్చే పాకుడు జీవులు విలువైన రొయ్యలు, చేపల చెరువుల్లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పీతలు, పాములు, తాబేళ్లు చెరువుల్లోకి చేరకుండా చుట్టూ మెష్‌లు, వలలు గోడ వల్లే ఏర్పాటు చేసుకోవాలి. ఖర్చుతో కూడుకున్న ఈ వ్యవస్థ ఆక్వా కల్చర్‌కు తప్పనిసరి. ఇదే విధంగా పక్షుల వల్ల కూడా ఆక్వా కల్చర్ తీవ్ర నష్టాలకు గురైన సందర్భాలు చాలానే ఉన్నాయి. ప్రధానంగా నీటి పక్షులు, కొంగలు వల్ల చాలా ప్రమాదం. ఇవి చెరువు నీటిపై వాలినా సమస్యలొస్తాయి. రోగ గ్రస్తమైన చేప, మరే ఇతర జీవినో నోట కరిచి గాలిలో ప్రయాణిస్తూ రొయ్యల చెరువులోకి జారవిడిచినా కూడా రొయ్యలు వ్యాధుల బారిన పడతాయి. బయో సెక్యూరిటీలో భాగంగా పక్షుల నుంచి రక్షణ కోసం చెరువుపై భాగంలో అటూ, ఇటూ కట్టడం ద్వారా ఈ ప్రమాదాన్ని నివారించవచ్చు. మండలంలో కొందరు గుంతల చుట్టూ వలలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

చాలా ముఖ్యం



వ్యాధి రహిత తల్లి చేపలు, తల్లి రొయ్యలు, పోషక విలువలు కలిగిన మేత, జీరో వాటర్ ఎక్స్ఛేంజ్, నీటి యాజమాన్యం తదితర అంశాలు ఆరోగ్యకరమైన చేపలు, రొయ్యల పెంపకానికి దోహదపడతాయి. మత్స్య ఉత్పత్తులు పెరిగేందుకు, విదేశీ మారక ద్రవ్యం ఆర్జనకు, ఉపాధి అవకాశాలకు ఇవి చాలా ముఖ్యం. అలాగే, బయో సెక్యూరిటీ కూడా ఆక్వా కల్చర్‌కు ప్రధానమైంది. వ్యాధి కారక జీవుల్లేని పరిస్థితి కల్పిస్తే రైతుకు లాభదాయకం.
– డాక్టర్ పి.హరిబాబు, విశ్రాంత అసోసియేట్ డీన్, మత్స్య కళాశాల





పంటపాళెం, పైనాపురంలో రొయ్యల గుంత చుట్టూ రక్షణగా నెలకొల్పిన మెష్

ఆలయాన్ని చుట్టుముట్టిన వర్షపునీరు



మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ వర్షపునీరు నిల్వ చేరింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆలయం పురాతనమైంది. ప్రధాన రహదారి కన్నా మూడడుగుల దిగువన ఉంటుంది. దీంతో చిన్నపాటి వాన పడినా ఆవరణలో నీరు చేరుతుంది. అలాగే రోడ్డుపై నుంచి కూడా వర్షపునీరు వస్తుంది. గతంలో నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ ఉండేది. ఇటీవల గుడి పక్కనే నిర్మాణాలు చేపట్టడంతో ఆ పైపులు పూడిపోయాయి. దాతలు స్పందించి వర్షపునీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అర్చకులు హనుమాచార్యులు కోరుతున్నారు.

ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో విద్య



కొడవలూరు: మాట్లాడుతున్న నాగభూషణమ్మ



విడవలూరులో..

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పేర్కొన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో గురువారం నిర్వహించిన ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డేలో ఆమె మాట్లాడారు. పిల్లలకు మూడేళ్లు నిండాక అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ప్రీ స్కూల్ పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం ఖాజామస్తాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు హరిప్రియ, సునీత, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

విడవలూరు: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ లక్ష్మీపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డేను నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ వర్కర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇలా చేస్తే ఎలా!

- కేజ్ వీల్స్‌ను రోడ్లపై తిప్పుతున్న కొందరు కర్షకులు
- పట్టించుకోని అధికారులు



కేజ్ వీల్స్ తగిలించి వెళ్తూ..



దెబ్బతిన్న రోడ్డు

పొదలకూరు: వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రబీ సీజన్‌లో వరినాట్లు వేసే పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. అయితే కొందరు మాగాణి పొలాలను చదును చేసే కేజ్ వీల్స్‌ను ఇష్టానుసారం రోడ్లపై తిప్పుతుండటంతో రూ.కోట్లతో వేసిన తారురోడ్లు దెబ్బతింటున్నాయి. పలువురి బాధ్యతారాహిత్యంతో ఆయా గ్రామీణ ప్రాంతాల్లో ఛిద్రమవుతున్నాయి. కొన్నిచోట్ల రైతులు వరినాట్ల కోసం మాగాణి భూములను కేజ్ వీల్స్‌తో తొక్కిస్తున్నారు. వాటిని ట్రాక్టర్ ట్రక్‌లో వేసుకెళ్లి పొలాల్లో దించుకుని సేద్యం పనులు పూర్తయిన తర్వాత తిరిగి ట్రక్‌లోనే తరలించాలి. కొందరు రైతులు మాత్రం తమ ఇష్టానుసారం ఇళ్ల వద్ద నుంచి ఇనుప చక్రాలను ట్రాక్టర్ ఇంజిన్లకే తగిలించుకుని తారురోడ్లపై పొలాలకు తీసుకెళ్తున్నారు. ఇందువల్ల రోడ్లు పాడైపోతున్నాయి. ఇనుప చక్రాల బరువు, ఒత్తిడి వల్ల కంకర తేలిపోతోంది. క్రమంగా రోడ్లపై గుంతలు పడి ప్రయాణించేందుకు వీలులేనంతగా తయారవుతున్నాయి. దీనికి వర్షాలు తోడవుతుండటంతో రహదారుల పరిస్థితి దారుణంగా మారుతోంది. కేజ్ వీల్స్‌ను రోడ్లపై తిప్పకూడదనే నిబంధన ఉంది. అయితే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రైతులు స్వయంగా నియంత్రణ పాటించి రోడ్లను కాపాడుకోవాల్సి ఉంది.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పొదలకూరు: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని తహసీల్దార్ శివకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విరువూరులో, 7న సూరాయపాళెం, 10న మహ్మదాపురం, తాటిపర్తి, 11న నల్లపాళెం, బత్తులపల్లిపాడు, 12న ప్రభగిరిపట్నం, 13న బత్తులపల్లి, భోగసముద్రం, 17న నావూరు, 18న నేదురుమల్లి, వెలికంటిపాళెం, 19న నందివాయ, అయ్యగారిపాళెం, 20న తోడేరు, 21న చాటగొట్ల, 24న పొదలకూరు(తహసీల్దార్ కార్యాలయం), 26న కసుపర్తి, ఆల్తుర్తి, 27న ఆర్‌వైపాళెం, అంకుపల్లి, 28న గురవాయపాళెం, మొగళ్లూరు, 31న వావింటపర్తి, జనవరి 2న దుగ్గుంట, దుగ్గుంటరాజుపాళెం, 3న పులికల్లు, ఊసపల్లి, 4న దేగపూడి, దేగపూడిరాజుపాళెం, 7న ఇనుకుర్తి, మర్రిపల్లి, 8న పార్లపల్లి, బిరదవోలులో సదస్సులు జరుగుతాయని వెల్లడించారు.

• **మనుబోలు:** మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం – 1లో, 10న పిడూరు, 11న మడమనూరు, 12న వడ్లపూడి, 13న అనుపల్లిపాడు, 17న కాగితాలపూరు, 18న చెరుకుమూడి, ముద్దుమూడి, 19న జట్ల కొండూరు, కుడితిపల్లి, 20న పర్లపాడు, 21న అక్కంపేట, 24న వెంకన్నపాళెం, పిడూరుపాళెం, 26న బద్దెవోలు, 28న కట్టువపల్లి, కొలనకుదురు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలియజేశారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

• **బుచ్చిరెడ్డిపాళెం:** వవ్వేరులో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించనున్నామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై అర్జీలను అందజేయాలని కోరారు.

• **తోటపల్లిగూడూరు:** మండలంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం చిన్నచెరుకూరులో, 7న నరుకూరు, 10న పేడూరు, 11న ముంగళదొరువు, 12న పోట్లపూడి, 13న విలుకానుపల్లి, 17న సౌత్‌ఆములూరు, 18న తోటపల్లిగూడూరు బిట్ – 1, బిట్ – 2, 19న తోటపల్లి, 20న వరిగొండ బిట్ – 1, బిట్ – 2, 21న వరకవిపూడి, అనంతపురం, 24న ఈదూరు, 26న కోడూరు బిట్ – 1, 27న కోడూరు బిట్ – 2, కోడూరుకండ్రిగ, 28న కొత్తపాళెం, 31న వెంకన్నపాళెం గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా వెంకటగిరిలో నివాసం ఉంటున్న చిన్నా కుమార్తె బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతూ అక్కడి హాస్టల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో కుమార్తెను చూసేందుకు గానూ కళాశాల వద్దకు చిన్నా బుధవారం వచ్చారు. ఆరాతీయగా హాస్టల్‌కు వెళ్లిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పారు. అక్కడికి వెళ్లగా ఆమె కనిపించలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ బిల్లులతో నిధుల స్వాహా



ఎంపీటీసీ సభ్యుడిని పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'అధికార పార్టీ నాయకులు ఇసుక రీచ్‌ల్లో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా దోపిడీ సాగిస్తున్నా పట్టించుకునే అధికారి లేకుండా పోయారు. ఇరిగేషన్ పనులు చేపట్టకుండానే దొంగ బిల్లులు చేసుకుని నిధులు స్వాహా చేసేందుకు సిద్ధపడుతున్నారు. రైతుల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు పంచాయతీలో గురువారం కాకాణి పర్యటించారు. పొదలకూరు బిట్ – 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు తండ్రి గుంటి మస్తానయ్య నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో కాకాణి లింగంపల్లి ఎస్సీకాలనీకి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పొదలకూరు పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు తెనాలి సిద్ధయ్య బుధవారం అనారోగ్య కారణాలతో చనిపోయారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, కక్ష సాధింపులు అధికమయ్యాయని తెలిపారు. రైతాంగ సమస్యలు, విద్యుత్ చార్జీల పెంపు, విద్యా దీవెన, వసతి దీవెన నిధుల విడుదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పోరుబాట పడతామన్నారు. తమ ప్రభుత్వంలో అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన సర్వేపల్లి ఇప్పుడు అవినీతికి కేరాఫ్‌గా మారిందన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కాకాణి వెంట పార్టీ మండల అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, పంచాయతీ ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, కసుపర్తి ఎంపీటీసీ సభ్యుడు ఎం.బాలకృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, బొల్లినేని భారతమ్మ, కార్యకర్తలున్నారు.

లెక్క తప్పుతోంది..

- నిరుపయోగంగా వర్షపాత నమోదు కేంద్రాలు
- తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు
- వీటిపైనే ఆధారపడిన వివిధ శాఖలు



కోవూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపాత నమోదు పరికరం

కోవూరు: వర్షపాత నమోదు లెక్క తప్పుతోంది. ఫలితంగా మండలంలో పంట నష్టం వాటిల్లుతున్నా, రైతులకు సరైన న్యాయం జరగడంలేదు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గల తహసీల్దార్ కార్యాలయాల వద్ద వర్షపాత నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవి ఆధునికీకరణకు నోచుకోలేదు. ఫలితంగా నేటికీ పాత పద్ధతుల్లోనే వర్షపాతాన్ని నమోదు చేస్తున్నారు. మరోవైపు కొన్ని కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలో ఎక్కడ వర్షం కురిసినా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంపైనే అధికారులు ఆధారపడుతున్నారు.

ఇదీ తంతు..

భూమిలో అమర్చిన గొట్టంలో ఒక డబ్బాను ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అందులో పడిన వాన నీటిని లెక్కిస్తారు. అయితే ఇది తప్పుపట్టి దర్శనమిస్తోంది. పొరపాటున డబ్బా జారి కిందపడి నీళ్లు ఒలికిపోతే రెవెన్యూ సిబ్బంది సూత్రప్రాయంగా చెప్పిన లెక్కలే శరణ్యమవుతున్నాయి. వీటినే అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మరోవైపు మండలాన్ని ర్యాండమ్‌గా తీసుకోవడం ద్వారా ఒక్కో గ్రామంలో వర్షం కురిసి, మరో గ్రామంలో కురవకపోయినా అక్కడా పడినట్లుగానే పరిగణిస్తున్నారు. ఇలా చేయడంతో వర్షం కురవని గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వర్షపాత నమోదు కేంద్రాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనల మేరకే పీటీసీ సమావేశం



మాట్లాడుతున్న వసంతకుమారి

కొడవలూరు: విద్యాశాఖ కమిషనర్ సూచనలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను శనివారం నిర్వహించాలని ఎంఈఓ వసంతకుమారి సూచించారు. కార్యక్రమ ఏర్పాట్లపై మండలంలోని బొడ్డువారిపాళెంలో గల ఓవెల్ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు వంద శాతం హాజరయ్యేలా హెచ్‌ఎంలు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంఈఓ అంకయ్య మాట్లాడారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రుల గౌరవ మర్యాదలకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక సమతుల్యత అవసరం



మాట్లాడుతున్న నాగార్జున

కొడవలూరు: యువతకు ఆర్థిక సమతుల్యత అవసరమని ఎన్‌ఐఎస్సెమ్ ట్రెయినర్ నాగార్జున పేర్కొన్నారు. ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్‌పై అనే అంశంపై నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మ్యూచువల్ ఫండ్స్, ప్రైమరీ, సెకండరీ మార్కెట్, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్, కెరీర్ ఇన్ సెక్యూరిటీ మార్కెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ గుణశేఖర్, ఆర్ అండ్ డీ డీన్ వెంకటనాగేంద్ర, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు



కొడవలూరు: కొడవలూరులోని దళితవాడలో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫైలేరియా నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించడమే లక్ష్యంగా పరీక్షలు చేస్తున్నామని వివరించారు. హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎంలు శేషుబాయి, సుభాషిణి పాల్గొన్నారు.